భోగి మంటలతో స్వాగతం

నమస్తే నెట్‌వర్క్, జనవరి 14: జిల్లావ్యాప్తంగా మూడు రోజుల సంక్రాంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. అన్ని మండలాల్లోనూ ప్రజలు ఆదివారం భోగి మంటలతో సంక్రాంతికి స్వాగతం పలికారు. పండుగను పురస్కరించుకుని అన్ని వర్గాల ప్రజలు ఇళ్ల ఎదుట రంగులతో ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. తెల్లవారుజామున భోగి మంటలు వేసి చలి కాచుకున్నారు. గుమ్మాలకు తోరణాలు కట్టి అందంగా అలంకరించారు. పిండి వంటలు గుమగుమలాడాయి. దూర ప్రాంతాల్లో ఉన్న బంధువులు, కుటుంబీకులు ఒక చోటకు చేరి సంతోషంగా పండుగ జరుపుకున్నారు. పట్టణాలు, పల్లెల్లో పండుగ సందడి నెలకొన్నది.

అశ్వారావుపేట

అశ్వారావుపేట టౌన్

అన్నపురెడ్డిపల్లి

పాల్వంచ

అశ్వారావుపేట టౌన్: బరిలోకి పుంజులను వదులుతున్న జూదరులు

అశ్వారావుపేట టౌన్: బరిలో పందెం కోళ్లు

అశ్వారావుపేట టౌన్

కరకగూడెం

టేకులపల్లి: కోలాటం వేస్తున్న కళాకారులు

మణుగూరు టౌన్

భద్రాచలం

టేకులపల్లి

అశ్వారావుపేట రూరల్

కొత్తగూడెం అర్బన్

రామవరం

చండ్రుగొండ

జోరుగా కోడి పందేలు

అశ్వారావుపేట టౌన్, జనవరి 14: సంక్రాంతి సంబురాలు అంబరాన్ని అంటుతున్నాయి. సంక్రాంతి పండుగకు ఆనవాయితీగా మారిన కోడిపందేలు వీక్షించేందుకు తెలంగాణ నుంచి సరిహద్దు ఆంధ్రప్రదేశ్‌లోని కోడిపందేల స్థావరాల వద్ద దర్శనమిచ్చారు. మొదటి రోజు లక్షల్లో నగదు చేతులు మారాయి. కాయ్..రాజా కాయ్.. అంటూ బరుల వద్ద బరి గీసి సై అంటున్నారు. రాత్రి విద్యుత్ కాంతుల మధ్య జరిగిన పందేలను వీక్షించి సంతోషం వ్యక్తం చేశారు. మూడు రోజులపాటు జరిగే కోడిపందేలను తిలకించేందుకు మహిళలు, రాజకీయ నాయకులు సైతం ఆత్రుత కనబర్చారు.

సరిహద్దు గ్రామాల్లో...

మధిర, జనవరి 14: రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఆంధ్రా ప్రాంత గ్రామాల్లో ఆదివారం జోరుగా కోడిపందేలు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా ప్రతీ సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌లో మూడు రోజుల పాటు కోడిపందేలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతున్నది. ఆంధ్రా సరిహద్దు గ్రామాలైన ఊటుకూరు, నెమలి, వినగడప, పెనుగంచిప్రోలు, వత్సవాయి, లింగాల, చీమలపాడు, తిరువూరు, మైలవరం, పెద్దాపురం, తదితర గ్రామాల్లోని మామిడితోటలో కోడిపందేలతోపాటు, జూదం నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పందేలు నిర్వహించే చోట భోజనం, మందు సైతం అందుబాటులో ఉంచారు. తెలంగాణ రాష్ట్రంలో కోడిపందేలపై నిషేధం ఉండడంతో పందెంరాయుళ్లు తెలంగాణ ప్రజల కోసం ప్రత్యేకంగా సరిహద్దు గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు.

మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనానికి ర్యాలీగా వెళ్తున్న మున్నూరుకాపులు

చండ్రుగొండ, జనవరి 14: మండల పరిధిలోని పోకలగూడెం గ్రామంలోని మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం గ్రామం నుంచి కుటుంబాలతో మేళతాళాలు, సంప్రదాయ నృత్యాలతో వచ్చి గ్రామ శివారులోని మామిడితోటలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అచ్యుతాపురంలో వాలీబాల్ పోటీలు

జెండా ఎగురవేస్తున్న సర్పంచ్ కృష్ణవేణి

దుమ్ముగూడెం, జనవరి 14: ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో అచ్యుతాపురంలో నిర్వహిస్తున్న మండల స్థాయి సోయం నవీన్‌కుమార్ మెమోరియల్ వాలీబాల్ పోటీలు ఆదివారం రెండోరోజుకు చేరుకున్నాయి. పోటీలను సర్పంచ్ కృష్ణవేణి జెండా ఎగురవేసి ప్రారంభించారు. విజేతలకు సోమవారం బహుమతులు ఇస్తామని నిర్వాహకులు తెలిపారు.

జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

కొత్తగూడెం టౌన్, జనవరి 14 : జిల్లా ప్రజలకు కలెక్టర్ ప్రియాంక ఆల ఆదివారం ఒక ప్రకటనలో సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు భోగభాగ్యాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ సంక్రాంతి ప్రతి కుటుంబంలో నూతన కాంతులు నింపాలని కోరుకున్నారు.

కొత్తగూడెం అర్బన్, జనవరి 14 : సంస్కృతి, సంప్రదాయాల మేళవింపే సంక్రాంతి పర్వదినమని బోగి, సంక్రాంతి, కనుమ పేరుతో మూడ్రోజులపాటు నిర్వహించుకునే ఉత్సవాలు ప్రజల్లో కొత్త ఆలోచనలకు, నూతన తేజానికి నాంది పలుకుతాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని పాత కొత్తగూడెంలో యువజన సమాఖ్య నాయకుడు ఇమ్మగడ్డ వికాస్ జ్ఞాపకార్థం నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల జమలయ్య, రత్నకుమారి, ఫమీం, కిలారు ప్రసాద్, రామారావు, పుట్టి భాగ్యలక్ష్మి, షాహిన్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు చేయించాలి

మణుగూరు టౌన్, జనవరి 14: పినపాక నియోజకవర్గవ్యాప్తంగా దెబ్బతిన్న అన్ని ప్రధాన రహదారులతో పాటు గ్రామస్థాయి రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం పీఆర్, ఆర్‌అండ్‌బీశాఖల అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. వానకాలంలో కురిసిన వర్షాలకు పలు చోట్ల రహదారులు కోతకు గురయ్యాయని, మరికొన్ని చోట్ల వాగుల్లో వరద ఉధృతికి రహదారులు కొట్టుకుపోయాయన్నారు. మణుగూరు– భద్రాచలం, మణుగూరు–ఏటూరునాగారం రహదారుల్లో ఈ తీవ్రత ఎక్కువగా కనిపిస్తున్నదన్నారు. వచ్చే నెల మేడారం జాతర ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లా నుంచి భారీగా భక్తులు వెళ్లే అవకాశం ఉందన్నారు. యుద్ధప్రాతిపదికన రహదారులను బాగు చేయాలని సూచించారు.

ఎమ్మెల్యేకు సన్మానం

మణుగూరు టౌన్, జనవరి 14: మణుగూరు పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మానవ హక్కులు, వినియోగదారుల పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందాడి సంజీవరావు మర్యాదపూర్వకంగా కలిశారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

గౌతంపూర్‌లో ముగ్గుల పోటీలు

రామవరం, జనవరి 14 : ముగ్గుల పోటీలు ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొస్తాయని చుంచుపల్లి మండల వైస్ ఎంపీపీ వట్టికొండ మల్లికార్జున్ అన్నారు. ఆదివారం గౌతంపూర్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో తెలంగాణ క్రాంతి ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్పంచ్ పొడియం సుజాతతో కలిసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్రవంతి, కో ఆప్షన్ సభ్యుడు పొనగంటి రాజు, విశ్వ మాత మదర్‌థెరిస్సా సేవా సంస్థ సభ్యుడు గూడెల్లి యాకయ్య, తెలంగాణ క్రాంతి, చలం, సింగరేణి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వైరాటౌన్, జనవరి14: స్థానిక ఠాగూర్ క్రాంతి జూనియర్ కళాశాలలో ఇంటర్ 2007–09 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం స్థానిక ఠా గూర్ విద్యాసంస్థలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా కలుసుకొని ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఠాగూర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, ఆనాటి అధ్యాపకులు ఎస్ఎం రఫీ, డాక్టర్ గుడిమెట్ల మోహన్‌రావు, నాగనబోయిన లింగారావును సన్మానించారు.

గోదాదేవి కల్యాణం

గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

చండ్రుగొండ, జనవరి 14: మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వేదపండితులు వివిఆర్‌కెమూర్తి ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణం సందర్భంగా పలువురు దంపతులు పీఠలమీద కూర్చొని కల్యాణం జరిపించారు. పురోహితులు వెంకటేశ్వరశర్మ, భాస్కరశర్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడులు

పర్ణశాల, జనవరి 14: పెద్దకమలాపురం శివారులో కోడి పందేల స్థావరాలపై ఆదివారం దుమ్ముగూడెం పోలీసులు దాడులు నిర్వహించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2 వేల నగదుతోపాటు రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలంలో నిలిపిన రెండు బైక్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

చండ్రుగొండ, జనవరి 14: రోడ్డుప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడేనికి చెందిన మహంకాళి చిన్నవెంకటి (55) అనే వృద్ధుడు కొన్నాళ్ల నుంచి చండ్రుగొండ మండలం సీతాయిగూడెంలోని ఓ ఆయిల్‌పాం తోటలో కాపలాదారుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం విధులు పూర్తయిన తర్వాత ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. ఘటనలో తీవ్రగాయాలపాలైన చిన్నవెంకటి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై మాచినేని రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. వృద్ధుడి మృతిపై స్థానికంగా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల విచారణలో పూర్తి వాస్తవాలు వెలుగు చూడాల్సి ఉన్నది.

నేడు ప్రజావాణి రద్దు

కొత్తగూడెం టౌన్, జనవరి 14 : సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం ప్రభుత్వ సెలవు అయినందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. అధికారులు అందుబాటులో ఉండని కారణంగా ప్రజలు ఈ విషయాన్ని గమనించి కలెక్టరేట్‌కు రావొద్దని పేర్కొన్నారు.

పతంగులు ఎగురవేతలో జాగ్రత్తలు తీసుకోవాలి

భద్రాచలం, జనవరి 14: పిల్లలు పతంగులు ఎగుర వేసే సమయంలో పెద్దలు పక్కనే ఉండి ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్ ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. ఎగురవేసేందుకు మాంజా దారాన్ని వినియోగించడం నిషేధమన్నారు. ఎవరైనా కోడి పందేలు ఆడినా, జూదమాడినా సహించబోమన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ఉపేక్షించమన్నారు.

భారత్ జోడో న్యాయ యాత్రకు సంఘీభావం

పాల్వంచ, జనవరి 14 : రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్రకు సంఘీభావంగా పాల్వంచ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ జెండాలు చేబూని, నినాదాలు చేస్తూ నాయకులంతా ర్యాలీలో పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ చేసిన సూర్యనారాయణ దంపతులు

వృద్ధులకు దుస్తుల పంపిణీ

దమ్మపేట రూరల్, జనవరి 14: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండల పరిధిలో మండలపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు, ఉపసర్పంచ్, దిశ కమిటీ సభ్యుడు గారపాటి సూర్యనారాయణ దంపతులు వృద్ధులకు దుస్తులు పంపిణీ చేవారు. 30 మంది వృద్ధుల పోషణ బాధ్యత తీసుకుని కొన్ని సంవత్సరాలుగా అహారాన్ని అందజేస్తున్న సూర్యనారాయణ దంపతులకు వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు.

అశ్వారావుపేట రూరల్, జనవరి 14: మండలంలోని దిబ్బగూడెం పంచాయతీ దురదపాడు గ్రామంలోని గిరిజన మహిళలు, వృద్ధులకు బీఆర్ఎస్ నాయకుడు బిర్రం వెంకటేశ్వరరావు దుస్తులు పంపిణీ చేశారు. వారికి దుప్పట్లను ఆయన మనుమడు జతిన్, మనుమరాలు హేమశ్రీ పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు పండా రాజు, ఉప సర్పంచ్ పండ రాజులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న బిర్రం కుటుంబీకులు

రసవత్తరంగా యూసుఫ్ టోర్నీ

విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

బూర్గంపాడు, జనవరి 14 : మండల కేంద్రమైన బూర్గంపాడులో యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ రసవత్తరంగా జరిగింది. మొదటి మ్యాచ్ ఫ్రెండ్స్ ఎలెవన్ బంజర జట్టు టాస్ గెలిచి బౌలింగ్‌ను ఎంచుకోగా, విరాట్ ఎలెవన్ రామవరం జట్టు బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 10 ఓవర్లలో 74 పరుగులు చేసి ఏడు వికెట్లు కోల్పోయింది. 75 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఫ్రెండ్స్ ఎలెవన్ బంజర జట్టు 10 ఓవర్లకు 63 పరుగులు చేసి పరాజయం పాలైంది. వీరికి గ్రామ యువ నాయకుడు దుద్దుకూరి రాజా, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు అబ్దుల్ సలీం, కిశోర్, అనిల్, నాగరాజుల చేతుల మీదుగా అందించారు. రెండోమ్యాచ్‌లో ఎలెవన్ వారియర్స్ జట్టు బ్యాటింగ్ చేయగా పది ఓవర్లలో 75 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన స్కై ఎలెవన్ జట్టు 81 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ జట్టుకు పాత్రికేయులు శ్రీనివాస్, కోట రమేశ్, కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. మూడో మ్యాచ్‌లో శ్రీరామ్ పాల్వంచ జట్టు పది ఓవర్లలో 91 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసి తేజ ఎలెవన్ సారపాక జట్టు 96 పరుగులు చేసి విజయం సాధించింది. సారపాక జట్టుకు టోర్నీ ముఖ్య సలహాదారు సోహెల్‌పాషా, అనిల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సాయంత్రం జరిగిన నాలుగో మ్యాచ్‌లో సాధన ఎలెవన్ జట్టు కొత్తగూడెంపై ఫరీద్ ఎలెవన్ పాల్వంచ జట్టు విజయం సాధించింది. నాలుగు జట్లు విరాట్ రామవరం, స్కై ఎలెవన్ బూర్గంపాడు, తేజ సారపాక జట్టు, ఫరీద్ పాల్వంచ జట్లు క్వాటర్ ఫైనల్‌కు చేరుకున్నాయి.